మూడురోజులై వర్షంకురుస్తోంది. ఈదురుగాలి. చిక్కటి చీకట్లు మునురుకుంటున్నాయి. ఆచీకట్లను ముక్కలు ముక్కలు చేస్తూ నన్నని మెరుపులు మెరుస్తున్నాయి. మిన్నువిరిగి నేలపై పడినట్లు ఉరుములు ఉరుముతున్నాయి భయంకరంగా.

ఆసమయంలో గోవిందపురం రైల్వే స్టేషన్ నిర్మానుష్యంగావుంది. దూరంగా స్టేషన్ మాష్టరుగదిలో మాత్రం కిరోసిన్ దీపం వెలుగుతోంది పేదవాడి ఆశలా. ఆచిన్న స్టేషన్‌లో ప్యాసంజరు బండి తప్పించి మరేది ఆగదు. దూరంగా ఓ చిన్నటీదుకాణం, మరి కొంచెం దూరంలో ప్రయాణీకులు కూచుందికి చిన్న షెడ్డూ వున్నాయి.

ఆ షెడ్ రేకులన్నీ గాలికి ఎగిరిపోయి నిర్భాగ్యుడి బ్రతుకులా మొండిగావుంది. అంతా నీటిమయం.

టీకొట్టు సీతయ్యప్యాసెంజరు బండికోసం ఎదురు చూస్తున్నాడు. బండి వస్తే కనీసం నాలుగుటీలన్నా అమ్ముడు పోతాయి. అసలేవర్షంకదా. గిరాకీ ఎక్కువగా వుంటుంది. మామూలు సమయాలలో పదిహేను పైసలకమ్మిన టీ ఇప్పుడు పావలాకి అమ్ముడై పోతుంది. బండిరావడానికి ఇంకా గంటసేపుంది. సీతయ్య పాటలు పాడుతున్నాడు. మధ్యమధ్యలో చుట్టకాలుస్తున్నాడు.

దూరంనించి వర్షంలో తడుస్తూ నలుగురు పిల్లలతో సహావస్తోంది ఓస్త్రీ. ఆమెవర్షానికి బాగా తడిసి ముద్దయింది. చంకలో ఓ పిల్లడూ, చేతిలో ఓ బిడ్డా, మరో ఇద్దరు పెద్ద పిల్లలు ఆమెనను సరించి వస్తున్నారు. ఆమె వర్షాన్ని తప్పించుకోవాలని విఫలప్రయత్నం చేస్తోంది.

స్టేషన్‌మాష్టరు గది వైపుగా నడిచిందామె.

"మేష్టారూ! బండి ఎన్ని గంటలకు వస్తుంది?" అంటూ ప్రశ్నించింది స్టేషన్ మాష్టర్ని ఉద్దేశించి.

ఆయన కళ్లజోడు సవరించుకుని ఓసారి. ఆమెవైపు చూసి, పది గంటలకు వస్తుంది!" అని "ఏమమ్మా ఇంత మునురులో ఈరాత్రి ప్రయాణం చెయ్యక పోతేనేం?" అన్నాడు తడిసి ముద్దయిన ఆమెను చూస్తూ.

"అత్యవసరమైన పనిమీద వెళ్తున్నాను మాష్టారూ!" "ఈరోజు తప్పితే నేను మరి వెళ్లవలసిన అవసరమే వుండదు!" అందిఆమె.

ఒక్క క్షణం ఆమె వైపుచూసి తన పనిలో తాను మునిగి పోయాడు స్టేషన్‌మాష్టరు.

ఎక్కడానిలబడడానికి అస్కారంలేదు. పోనీ స్టేషన్ మాష్టరు రూమ్‌లోనే నిలబడదామంటే అతను అంత సౌమ్యుల్లా కనపడలేదు. అందు నా తను ఒక్కర్తెకాదు. నలుగురు పిల్లలతో సహానిలబడాలి.

రేకుల షెడ్ వైపుగా నడిచిందామె. అక్కడ ఓ మూల పొడిగావుంది. పైన ఇంకా రెండురేకులు మిగిలి వున్నాయి అక్కడ.

గబగబ అక్కడికి చేరుకుంది. చంటివాడు చలికి ఒంటికి కరుచుకు పోయాడు. మిగిలిన పిల్లలు కూడా చలికి వణుకు తున్నారు. అక్కడ ఒకే ఒక సిమెంటు బెంచీవుంది. అది కూడాకాళీగా లేదు. అక్కడో మనిషి ముసుగు పెట్టి పడుకున్నాడు. ఆబెంచీపక్కనే, ఆకొద్దిజాగాలోనే నిలబడిందామె పిల్లలతో సహా. స్థలం కుశలంకా పడంచేత పిల్లలు అలజడి కలిగిస్తున్నారు. పడుకున్న వ్యక్తి మీద పట్టరానికోపం కలిగింది ఆమెకి. 'ఎంత నిశ్చింతగా నిద్రపోతున్నాడు? లోకమంతా మునిగి పోతూవుంటే' అనుకుంది. "ఏయ్‌నిన్నే! "పిల్లతో చస్తూ వుంటే ఏమిటా నిద్ర? లేచికాస్త చోటి య్యి!" అంటూ కసురుకుంది.

ఆ వ్యక్తి ముసుగు సడలించి చూశాడు.

ఒక్క సారి త్రుళ్లి పడిందామె.

మెరుపు వెలుగులో అతని రూపం స్పష్టంగా కనిపించింది.

అవ్యక్తి కుష్టురోగి. చేతులు కాళ్లూ మొండిగా వున్నాయి. ముక్కు చప్పిడి పోయింది. పెదవులు బండబారాయి. "భగవాన్ ఎందుకీ నికృష్ట జీవుల్ని సృష్టించావు? చిన్నప్పటినించీ తనకి అలాంటు వాళ్లని చూడడం అంటే అసహ్యం. ఒక విధ మైన జుగుప్స.

అతనులేచి వెళ్లి కొంచెం దూరంలో క్రింద కూచున్నాడు. ఇప్పుడా సిమెంటు బెంచీకాళీగావుంది. అక్కడికి వెళ్లికూచోవాలంటే ఏదో రోతలా వుందామెకి.

"అమ్మా అక్కడకు వెళ్లికూచుందాం" అన్నారు పిల్లలు. గత్యంతరం లేక అక్కడకు వెళ్ళి కూర్చుందామె పిల్లలతో సహా.

ఒకవైపు చలి. ఇంకొకవైపు ఏదో అనిర్వచనీయమైన బాధ ఆమెను నిలవనీయడంలేదు.

"సుఖదుఃఖ సమ్మిశ్రితమైన బ్రతుకులోంచి మనిషికి




# పునరావృతం

కె. తాయారమ్మ

వీడికేకావాలి! "అనుకుంటూ, 'దేవదాను' అంది నిర్లిప్తంగా.

"దేవదాను" అని అస్పష్టంగా గొణుగుతూ, "అమ్మగారూ శరత్‌బాబుదేనా?" అంటూ మళ్లా ప్రశ్నించాడు.

"శరత్‌కాక ఇంకె వరు రాసారు దేవదానుని?" వీడికి చిన్న రసజ్ఞత కూడా వుందిలావుంది! అనుకుంది అదోరకంగా నవ్వుకుంటూ.

రెండు గంటలకి కాని బండిరాదు. అంత వరకూ తనెలా గడపడం? అప్పుడే పదిగంటలు దాటింది. ఇంకా మూడుగంటలు గడపాలి!" వర్షం జోరు హెచ్చయ్యింది. మంచుతో కూడినగాలి వీస్తోంది! తనకి చేర బడి పెద్ద పిల్ల కూడా నిద్రలోకి జారి పోయింది.

అంత వర్షంలోను చీకట్లోంచి నడిచి వస్తోంది. అదే ఆకారం. స్టేషన్ మాష్టరు గది వైపునడిచి ఇటు వైపుగా వస్తోంది.

కళ్లు పెడల్పు చేసి చూసింది పల్లవి. ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయి చేతిలో సూట్‌కేసుతో సహాపెద్ద వైపుగా వస్తోంది. "ఇక్కడ ఆమె కూడా హక్కు సంపాదించు కుంటుందికాబోలు! ఇప్పటికే సగంతడిసి ఛస్తూ వుంటే!" ఆ అమ్మాయి దగ్గరగా వచ్చింది. పోనీలే కాస్త జాగా ఇస్తే కంపెనీ వుంటుంది! అనుకుంది పల్లవి.

"అబ్బ ఏమిటో ఈ మునురు?"అనుకుంటూ వచ్చి నిల బడింది ఆ అమ్మాయి.

"ఇలారండి అమ్మాయిగారూ!" అంటూతను లేచి జాగా ఇచ్చాడు కుష్టురోగి. ఇప్పుడు వాడు పూర్తిగా వర్షంలోకి వచ్చాడు.

"ఏవూరు వెళ్తున్నావమ్మా?" అంటూ పలకరించింది పల్లవి ఆ అమ్మాయిని ఉద్దేశించి.

ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదు. ఎవరికోసమో చుట్టూకలయ జూస్తోంది. "ఏమండీ ఇంతక్రితం ఇక్కడకు ఎవరైనా వచ్చారా?" ఆత్రుతగా ప్రశ్నించింది.

విషయం అర్థం అయింది పల్లవికి. అంత చీకట్లోనూ ఆ అమ్మాయి కళ్లు బెదురు తుండడంచూసింది. "ఈ వయస్సులో ఇది సహజం!" ఎన్నో నిరీక్ష అనంతరం బ్రతుకు ఏగమ్యం చేరుకుంటుందో ఎవరికీ తెలియదు! ఒకప్పుడు తన బ్రతుకే మయింది? "సింహాల పేట రైల్వే స్టేషన్‌లో ఎన్నిగంటలు ఎదురు చూసింది?" తరువాత ఏం జరిగింది? నిరాశనిండిన జీవితంతో ఎలారాజీ పడింది? గతజ్ఞాపకాలు కలచి వేస్తూవుంటే వెచ్చని నీటి బిందువులు జారి పడ్డాయి పల్లవి చెంప మీదుగా.

"ఆంటీ! ఇంతక్రితం ఇక్కడికి ఎవరైనా వచ్చారా?" ఆందోళన మిళితమై వుందా ప్రశ్నలో.

లేద న్నట్టుతల ఊపింది పలవి.

"అమ్మాయ్ ఇంతవర్షంలో వచ్చావు! అంతఅత్యవసరమా?" అంది పల్లవి ఆపిల్లని చూస్తూ అదితనని స్టేషన్ మాష్టరు వేసిన ప్రశ్న అప్పుడు తనకి ఎంత కోపం వచ్చింది! ఈ అమ్మాయి మాత్రం ఏ కారణం లేకుండా ప్రయాణం చేస్తుందా?

ఆ అమ్మాయిచేతిలో టార్చి లైటుంది. మాటిమాటికీ నాలుగు వైపులా చూస్తోంది లైటు సహాయంతో. కాని వర్షపు ఉధృతానికి ఆవెలుగులు చీలి పోతున్నాయి. ప్రకృతి ముందు ఇవన్నీ వృథాయే!

లైటు వెలుగులో పల్లవి చేతిలోని పుస్తకం వైపు చూసింది ఆ అమ్మాయి."ఆంటీ ఈ పుస్తకం ఎందుకు తెచ్చుకున్నారు?" అంటూ ప్రశ్నించింది.

పల్లవి కళ్లల్లో ఏదో వింతకాంతి బయలు దేరి అంతలోనే మాయమయ్యింది. "ఆపుస్తకం వెనకాల వున్న ఆ మధురమైన జ్ఞాపకాలని ఎలా చెప్పగలదు? అది తనకు ఒక మహోన్నతమైన వ్యక్తి ఇచ్చిన చిరుకానుక! అది స్వల్పమైనదైనాతన కెంతో అమూల్యమైనది; అది తనకు ప్రియాతి ప్రియమైనదని ఎలా వచిస్తుంది?

"ఆంటీ దేవాదాను మంచి నవలకదూ?"

"అవునమ్మా! శరత్‌బాబు మంచి రచయిత. అతని రచనల్లో దేవదాను ఉన్న తమయిన స్థానం పొందింది.

"నాకు శరత్ సాహిత్యం అంటే చాలా ఇష్టం ఆంటీ!" "అతని వి చాలా పుస్తకాలు చదివాను! ఆంటీ దేవదాను విషాద భరిత మైన కథహృదయాల్ని కదిలించి వేస్తుంది కదూ? దేవదాసులాంటి పిరికి పాత్రల్ని సృష్టించడంలో శరత్ ఉద్దేశం ఏమిటి ఆంటీ?" పల్లవి ముఖంలోకి చూస్తూ ప్రశ్నించింది ఆ అమ్మాయి.

సమాధానం చెప్పలేదు పల్లవి. మౌనంగా వుండి పోయింది. 'దేవదాను' పిరికివాడా? వెచ్చని నీటి బిందువులు చెక్కిళ్ల మీదుగా జారాయి.

ఎక్కడో దూరంగా పిడుగుపడి న శబ్దం అయింది. ఆ అమ్మాయి జడుసుకుంది. ఇంతపెద్ద వానలో, పైగా రాత్రి సమయంలో ఈ అమ్మాయి ప్రయాణం ఎక్కడికో? ఈ నిరీక్షణ ఎవరికోసమో? అనుక్షణం ఆమెలో గతం మెదులుతోంది.

"ఆరోజు.... ఇలాగే వర్షం!... ఒంటరిగా బెదిరిపోతూ... తను నిలబడివుంది సింహాల పేట రైల్వే స్టేషన్‌లో. క్షణం ఒకయుగంగా గడిపింది. ఆరోజు కూడా తను ఒక్కర్తే వుంది. ప్రయాణీకు లంతా వెళ్లిపోయారు. తను ఏవ్యక్తి కోసం మధురంగా నిరీక్షిస్తోందో, అవ్యక్తి రాలేదు! తియ్యగా నమ్మించాడు. అందంగా మోసగించాడు. అతను... అతను... ఎవరు? 'చరణ్!'

చరణ్ జ్ఞాపకాలు మనస్సుని కలచివేశాయి.

"ఆంటీ! వర్షం హెచ్చవుతోంది!" గునుస్తూ అందా అమ్మాయి.

నవ్వింది పల్లవి. "ఏం వచ్చినప్పుడు తెలియలేదా?" అనుకుంది మనస్సులోనే?

కుష్టురోగి అలా వర్షంలో నానిపోతూనే వున్నాడు. "పోనీ 'అలా అటే దుకాణం దగ్గర కూర్చోరాదూ?" అనుకుంది పల్లవి. ఆ మాటే అంది వాడితో.

వాడు నవ్వాడు బండ పెదవులతో.

జుగుప్స లాంటిది కలిగింది పల్లవికి. "అయినా వీడిలాంటి వాడిని ఎవరు చేరనిస్తారు?"

"ఆంటీ! అతను రాలేదు!" అందా అమ్మాయి.

"ఎవరూ?"

"గిరి! నా ప్రాణంలో ప్రాణం! నా జీవితానికో అలంబన! నా బ్రతుకుకు ఓ గమ్యం! తప్పకుండా వస్తానన్నాడు! ఇదిగో ఈ ఉత్తరం చూడండి!"

టార్చి లైటు వెలుతురులో ఉత్తరం చదివింది పల్లవి. ఆమెత్రుళ్లి పడింది. అది తన రక్తం పంచుకు పుట్టిన గిరి రాసినది! వాడు తన ప్రాణంలో ప్రాణం.

"గిరి ఈ అమ్మాయిని ప్రేమించాడా? లేవ తీసుకు పోవాలనుకున్నాడా?"



నా గురించి....

జన్మస్థలం : విజయనగరం జిల్లా రామతీర్థ గ్రామం.

వయసు : నాలుగు పదులు దాటాయి. (43)

చదువు : భాషా ప్రవీణ, పండిట్స్ ట్రైనింగ్, పి. ఒ. ఎల్. ఎం. ఎ.

ఉద్యోగం : విజయనగరం మహారాజా బాలికోన్నత పాఠశాలలో గ్రేడు I తెలుగు పండితురాలిగా.

ఇంతవరకు నా రచనలు వివిధ దిన, వార, పక్ష, మాస పత్రికలలో సుమారు యాభై కథల వరకు ప్రచురింపబడినవి. ఒకటి రెండు కథలు కన్నడ భాషలోనికి అనువదింపబడినవి.

మూడు సీరియల్ నవలలు, ఒక అనుబంధ నవల 'వనితా జ్యోతి', 'ఆంధ్ర జ్యోతి' డెయిలీ, 'ఆంధ్ర పత్రిక' డెయిలీలలో ప్రచురింపబడినవి. 'తీరంచేరని కెరటం', 'హరిత', 'జీవనవిపంచి', 'శ్రీచందన' మొదలైనవి.

'వనిత'లో ఇది నా రెండవ కథ. నా రచనలను ప్రచురించి ప్రోత్సహించిన 'వనిత' సంపాదకులకు నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

—కె. తాయారమ్మ

గత ఒలింపిక్ పోటీలు ఎక్కడ జరిగాయి ?

లాస్ ఏంజెలస్ (1984)

"చూడండి అంటీ! గిరి ఎంత మోసం చేశాడో!" అంది ఆ అమ్మాయి ఉక్రోషంగా.

"నాగిరి మోసగాడు కాదమ్మా! బ్రతుకు పోరాటంలో ఓడి పోయాడు!" అనుకుంది వల్లవి మనస్సులోనే.

రెండు రోజుల క్రితం గిరికి ముక్కులోంచి, నోట్లోంచి రక్తం పడింది. డాక్టరు చేత పరీక్షచేయిస్తే "కేన్సర్" అని చెప్పాడు. తన గుండె నిండా ఆవేదన అలుముకు పోయింది. గిరిబ్రతుకు మధ్యలో నమసిపోవల సిందేనా?

వల్లవి కన్నులనుండి నీటి బిందువులు జారి చెక్కిళ్ల మీద పడ్డాయి.

"ఆంటీ!" అందా అమ్మాయి ఆత్రంగా.

"పాపా నువ్వెళ్లి పోమ్మా! అతనురాడు!" అంది వల్లవి.

"మీకెలా తెలుసు ఆంటీ?" ఆ అమ్మాయి మొహంలో నిరాశ చోటు చేసుకుంది.

"ఊహించాను!"

దూరం ఎక్కడో పిడుగు పడినశబ్దం!

జ్ఞాపకాల తెరల్ని చీల్చుకుంటూ వల్లవి మనస్సు గతంలోకి జారుకుంది.

తల్లి తండ్రుల్ని చిన్నప్పుడు పోగొట్టుకున్న వల్లవి సింహాల పేటలో మేనత్త దగ్గర పెరిగింది. మేనత్త ఒంటరిది. తనని అల్లారు ముద్దుగా పెంచింది. మేనత్త ఇంటి కెదురుగా డాబా ఇంట్లో దిగారు హయగ్రీవ మూర్తిగారు. ఆయన మిలిటరీలో పనిచేశారు. యుద్ధంలో కుడి చెయ్యి పోయింది. భార్య పోయింది. పన్నెండేళ్ల కొడుకుతో వచ్చారాయన. ప్రభుత్వంకొంత డబ్బిచ్చింది. పల్లెటూరి వాతావరణం బాగుంటుందని సింహాలపేట వచ్చారు. అప్పటికి వల్లవి వయస్సు పది సంవత్సరాలు.

సింహాల పేటలో హయగ్రీవ మూర్తిగారు తాముని వసిస్తున్న డాబాఇల్లే కొనుక్కు న్నారు. ఇంకా కొంచెం భూమీపుట్రా కొన్నారు.

వాళ్లబ్బాయి పేరు శ్రీచరణ్. హయగ్రీవ మూర్తిగారు ఎప్పుడూ నవ్వుతూ వుండేవారు-"నీ పేరు వల్లవీ, మా అబ్బాయి పేరు చరణం!" అని.

వల్లవికీ చరణ్‌కి ఎంతో స్నేహం. మేనత్త ఇచ్చినచే గోడీలు తింటూ తోటలూ దొడ్లూ తిరుగుతూ వుండేవారు.

హయి గ్రీవం మామయ్యంటే తనకెంతో ఇష్టం! "వల్లవీ నువ్వు చరణ్ వల్లవీ చరణంలా కలిసి పోవాలని నా కోరిక!" అంటూ వుండేవాడు.

కాలగమనంలో పదేళ్లు గడిచిపోయాయి. చరణ్ పట్నంలో చదువుకుంటున్నాడు. హయగ్రీవం మామయ్య గుండె పోటుతో హటాత్తుగా మరణించాడు.

చరణ్ ఒంటరి వాడయ్యాడు.

ఉన్న పొలం ఇల్లూ చదువుకి అయిపోయాయి. ఆసమయంలో మేనత్త చరణ్‌ని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకోలేదు. ఆవిషయాన్ని పట్నంలో వున్న చరణ్‌కి రహస్యంగా ఉత్తరం రాసింది.

చరణ్ దానికి జవాబురాశాడు. "వల్లవీ నువ్వు ఎల్లుండి రాత్రి సింహాల పేట రైల్వే స్టేషన్‌కిరా!" "నేను వచ్చినిన్ను పట్నం తీసుకు వెళ్తాను!" అంటూ.

చిన్న పెట్టెలో బట్టలు సర్దుకుని బయలుదేరింది. సింహాల పేట స్టేషన్‌లో ఎంతో సేపుకూచుంది. ఎదురు చూసింది. విసిగి వే సారి పోయింది. అప్పుడు కూడా ఈదురుగాలి, మునురు. మేనత్త కళ్లుకప్పి ఒంటరిగా వచ్చింది.

చరణ్ రాలేదు.

రాత్రి పన్నెండు గంటలయ్యింది.

పట్నంనించి వస్తున్న యాదగిరి బాబాయి తనని చూసి ఆశ్చర్యపోయాడు. అతను వేసిన ప్రశ్నలకి తను సమాధానాలు చెప్పలేక పోయింది. తనని మెల్లగా నడిపించుకు పోయాడు ఇంటికి.

మేనత్త చీవాట్లు వేసింది. నెల రోజులు తిరక్కుండా శంకరంతో వివాహం జరిపించింది.

"చరణ్ ఎంత మోసగాడు?"

భర్తతో కొండ పేట వచ్చింది తను. కొండపేటలో కరణీకం చేస్తున్నాడు శంకరం.

సంసారిక జీవితంతో రాజీపడినా, చరణ్‌ని గూర్చిన మధురమైన జ్ఞాపకాలు మాత్రం తనని వీడిపోలేదు.

కుటుంబనియంత్రణ ఇష్టంలేని భర్తని ఎదిరించ లేక ఐదుగురు బిడ్డలకి తల్లి అయింది. శంకరం శంకరం పంతులుగా మారాడు.

కాలానికి నిలకడలేదు.

పెద్ద కూతతో ప్యాసెంజరు బండివచ్చి స్టేషన్‌లో ఆగింది.

స్మృతుల వీచికలలోంచివాస్తవంలోకి వచ్చింది వల్లవి.

పక్కకి తిరిగి చూసింది.

ఆ అమ్మాయి అక్కడలేదు.

పిల్లల్ని లేవ కొట్టి లగేజి తీసుకుని బండివైపుగా పరు గెట్టింది వల్లవి.

బండి కాళీగానే వుంది.

సీటుచూసుకొని కిటికీవైపుగా కూచుంది.

బండి కదల బోతోంది.

"అమ్మాయిగారూ! దేవదాసు!" అంటూ పుస్తకం అందించాడు మొండిచేతుల మధ్య ఇరికించుకుని.

అతను కుష్ఠువాడు. వెచ్చని అశ్రుకణాలు రాలి పడ్డాయి అతని చేతుల మీదుగా.

అతను అలా చూస్తూ నిలబడి పోయాడు.

బండి పరుగు లంకించుకుంది.

మర్నాడు తను వెళ్లే సరికి మేనత్త నులక మంచంలో కూ చుని గోవింద నామాలు పాడుకుంటోంది.

వల్లవి ఆశ్చర్య పోయింది. "కొంపమునిగి పోయినట్టు టెలిగ్రాం ఎందుకు వేశావు?" అంటూ మేనత్త నికూక లేసింది.

"తొందర్లో నేకాశీ వెళ్లాలను కుంటున్నానే పిల్లా! అటునించి తరిగి వస్తానోరానో? అందుకని నిన్నూ పిల్లల్నీచూసి, ఈ ఆస్తిపాస్తులు అప్ప చెప్పిపోదామని!" అంది మేనత్త.

మేనత్తని అలా చూసి నందుకు ఆనంద పడింది వల్లవి.

రెండు రోజులు సరదాగా గడిచాయి.

ఒరోజు మాటల మధ్యలో అంది మేనత్త. "వల్లవీ ఇది విన్నావా? ఈమధ్యయాద గిరి బాబాయికి శ్రీచరణ్ కనుపించాడట! గోవిందపురం స్టేషన్‌లో అడుక్కుంటు న్నాడట! ప్చ్! అతనికి కుష్ఠురోగంట! అసలు పోల్చుకో లేకుండా వున్నాడట!"

ఈ మాటలు వల్లవికి వినిపించడం లేదు.

ఆమె తల గిర్రున తిరగసాగింది. □



## నాట్యాచారిణి
## నిర్మలా రమేష్

శ్రీమతి నిర్మలారమేష్ శ్రీమతి వాసిరెడ్డి కనకదుర్గవద్ద నాట్యం అభ్యసించారు. భరత నాట్యంలో డిప్లొమా పొందారు. కూచిపూడి నృత్యరీతిలో డిప్లొమాకై కృషి చేస్తున్నారు. బాల్యంనుంచే నాట్య ప్రదర్శనలు ఇస్తూ పలువురి ప్రశంసలూ, బహుమతులు పొందారు.

1972లో తెనాలిలో 'శ్రీనటరాజ నృత్య కళానికేతన్' స్థాపించి నాట్యంలో శిక్షణ ఇవ్వసాగారు. ఇంతవరకూ రెండు వందల మంది ఆమెవద్ద నాట్యంలో శిక్షణ పొందారు.

"సాంప్రదాయపరమైనవే కాకుండా స్వంత అభినయాలు కొన్ని నేను రూపొందించాను. 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' స్వంత అభినయం. 'కొలువైతివా రంగసాయి', 'రామదాసు', 'అన్నమాచార్య కీర్తనలు' నాకు పేరు తెచ్చాయి. ఇప్పటివరకు సాంప్రదాయ పర మైన అంశాలనే తీసుకున్నాము. ఇకముందు ప్రజలకు మరింత దగ్గరగా సమాజంలోని సమస్యలను ప్రతిబింబింపజేసే అంశాలను చేపట్టాలనివుంది. అలాగే ప్రముఖ రచయితల గేయాలను జానపద నృత్యరూపాలుగా రూపొందించాలన్నది నా ఆశయం" అన్నారు నిర్మలా రమేష్.

—కొల్లూరి